■ గాలిపటమా పదపద...



సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీకల్పవల్లి సేవాట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం శివునిబొమ్మ సెంటర్‌లో పతంగులు, బెలూన్‌లను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు వెల్లంపల్లి కేశవరావు, ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి ఆత్మకూరి రాజేంద్ర ప్రసాదరావు, వాసవీ మిత్రమండలి అధ్యక్షుడు చేగు వెంకటేశ్వరరావు, విశ్వజనని ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొగ్గారపు బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

–నరసరావుపేట ఈస్ట్

■ 1990 టు 2023



స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లో 1989–90 విద్య సంవత్సరంలో పదోవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల అత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. పూర్వ విద్యార్థులు 43 మంది పాల్గొని తరగతి గదిలో పాత జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. అనంతరం తమ గురువులను పూలమాలలతో దుశ్శాలువాలతో మెమొంటోలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చిట్టేటి రవి, పాపసాని వెంకటేశ్వర్లు, అబ్బూరి శ్రీను, విమల,సునీత, అనురాధ, శ్రీకాంత్, సనిశెట్టి వెంకట గురువీరాంజినేయులు పాల్గొన్నారు.

–శావల్యాపురం

■ గోమాత.. మా జీవనధాత...



కనుమ పండుగ సందర్భంగా నూజెండ్ల గ్రామంలోని శ్రీ చెన్నకేశవస్వామి ఆలయంలో అర్చకులు క్రోసూరి రామ్మోహనాచార్యులు గోపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

–వినుకొండ(నూజెండ్ల)

■ శ్రీ లక్ష్మీ నృసింహా....



పట్టణంలోని కొండమెట్ల వద్ద వేంచేసి ఉన్న అతి పురాతనమైన శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ధనుర్మాస ఉత్సవ ముగింపు సందర్భంగా ఉత్సవమూర్తులను పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. ఈ ఊరేగింపులో పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు, మంగళహారతులు ఇచ్చారు. కార్యక్రమంలో ప్రధాన సేవకులు జాజుల మాల్యాద్రి, పండుగ, పట్టణ వ్యాపార అసోసియేషన్ పెద్దలు సనిశెట్టి లక్ష్మీ నారాయణ, కొత్తమాసు శివ, రెడ్డి నగేష్, నరసింహ, రాము, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

–వినుకొండ(నూజెండ్ల)

క్లుప్తంగా

పొగాకు బేళ్ల చోరీ ఘటనపై సమగ్ర దర్యాప్తు

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి, పిచికలపాలెం గ్రామాల్లో మెట్ట పొలాల్లో పొగాకు పాకాల్లో నిల్వ చేసిన తాళ్ల పోత్తులు (పొగాకు బెళ్లు) చోరీ ఘటనపై పోలీసులు సమగ్ర దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఫిర్యాదు మేరకు చోరీ జరిగిన స్థలాన్ని పరిశీలించామన్నారు. రెండు గ్రామాల్లో చోరీ జరిగిన మొత్తం రూ.ఒక లక్ష 20 వేల ఫిర్యాదులో బాధిత రైతులు తెలిపినట్లు ఎస్సై తెలిపారు.

అథ్లెటిక్స్ పోటీలకు కారుమంచి విద్యార్థి

శావల్యాపురం: మండలంలోని కారుమంచి గ్రామం జెడ్పీ ఉన్నత పాఠశాల్లోని అండర్–17 బాలురు విభాగంలో 9వ తరగతి విద్యార్థి బత్తుల రామాంజనేయులు జిల్లాస్థాయిలో పోటీల్లో 3 వేల మీటర్స్ వాకింగ్‌లో ద్వితీయ స్థానం సాధించినట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టరు పాదిలి వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో ఈనెల 11న నంబూరు జిల్లా పరిషత్ ఉన్న త పాఠశాల్లో జరిగిన పోటీల్లో రాష్ట్రస్థాయిలో ఎంపిక కాగా, ఈనెల 19 నుంచి 22 వరకు శ్రీకాకుళంలో జరగబోయే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపికైనా విద్యార్థి బత్తుల రామాంజినేయులును ప్రధా నోపాధ్యాయులు శంకర రంగారావు, పేరెంట్ కమిటీ చైర్మన్ అక్బర్, మాజీ ఎంపీపీ చుండూరి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు అభినందించారు.

తూబాడులో ఘనంగా చర్చి మహోత్సవం

నాదెండ్ల: తూబాడు గ్రామంలోని పునీత వన చిన్నప్ప చర్చి మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ప్రతి ఏటా జనవరి 15వ తేదిన చర్చి మహోత్సవం నిర్వహించటం ఆనవాయితీగా వస్తోంది. ఉదయాన్నే ప్రత్యేక ప్రార్థనల అనంతరం దివ్య పూజాబలి నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిషప్ చిన్నాబత్తిన భాగ్యయ్య హాజరయ్యారు. గురువులు, ఇంజినీరింగ్ కాలేజీ అధినేత కొమ్మారెడ్డి ఇన్నారెడ్డి పాల్గొన్నారు. వీరిని గ్రామస్తులు చర్చి వద్దకు ప్రత్యేక వాహనంలో తోడ్కొని వచ్చారు. స్థానిక పాస్టర్ మిల్కిన్‌రాజు ఆధ్వర్యంలో పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ప్రార్థనల్లో పాల్గొన్నారు. కార్యక్రమాలను గ్రామ పెద్దలు, ఉపసర్పంచ్ మద్దూరి కోటిరెడ్డి, మాజీ ఎంపీటీసీ రత్తయ్య, పెంటారెడ్డి ధామస్‌రెడ్డి, కాసు ప్రతాప్‌రెడ్డి, కటకం బాలశౌరిరెడ్డి, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

వేల్పూరులో పోలీస్ పికెట్

శావల్యాపురం: సంక్రాంతి పర్వదినం సందర్భంగా మండలంలోని వేల్పూరు గ్రామంలో ఇరు పార్టీల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొన్న సంఘటన సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామంలో టీడీపీ నాయకులు ప్రధాన కూడలి మార్గంలో ముగ్గుల పోటీలతో పాటు పార్టీ పరంగా పాట లు మైకులు ద్వారా ఏర్పాటు చేశారు. ఇదేక్రమంలో వైఎస్సార్ సీపీ వర్గీయులు గత రెండురోజుల నుంచి వివిధ రకాల పోటీలు నిర్వహణ ప్రశాంతమైన వాతావరణంలో చేస్తున్నారు. ఒక్కసారిగా గ్రామంలోని టీడీపీ నాయకులు మైకుల శబ్దంతో పాటు ముగ్గుల పోటీలకు సరిపడా స్థలానికి సంబంధించి హద్దులు గీతాల రూపంలో గీశారు. దీంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొన్న విషయాన్ని గ్రామస్తులు స్థానిక ఎస్సై గల్లా రవికృష్ణ సమా చారం ఇచ్చారు. దీంతో హుటాహుటిన సంఘటన స్థలానికి ఎస్సై గల్లా రవికృష్ణ తన సిబ్బందితో చేరుకొని పండుగ పర్వదినం రోజున పార్టీ పరమైన పాటలు వేయరాదని ఇలాంటి సందర్భాల్లో రాజకీయాలు చేయటం మంచిది కాదని మైకులో ప్రకటించారు. ప్రశాంతమైన వాతావరణంలో పండుగ వేడుకలు జరుపుకోవాలని ఇరు పార్టీల నాయకులకు సర్ది చెప్పారు. ఇరు పార్టీల ఏర్పాటు చేసుకున్న కార్యక్రమాలు నిర్వహణకు అనుమతులు రద్దు చేయటంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. గ్రామంలో పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు.

20న కబడ్డీ జట్ల ఎంపిక

నరసరావుపేట ఈస్ట్: ఉమ్మడి గుంటూరు జిల్లా సీనియర్ పురుషులు, మహిళల కబడ్డీ జట్టు ఎంపికలను ఈనెల 20 తేదీన విక్టరీ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎం.రాజశేఖర్, వ్యాయామ అధ్యాపకుడు ఎస్.కృష్ణంరాజు సోమవారం తెలిపారు.

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు



ప్రదర్శనలో జిల్లా కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: జిల్లాలో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని తాకాయి. పట్టణంలోని డీ.ఎస్.ఏ స్టేడియంలో పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మహిళలకు ఆటలు, పాటలు పోటీలను నిర్వహించారు. ఫ్యాషన్ షో సంప్రదాయ దుస్తులు పోటీలను కుటుంబ సభ్యులుతో నిర్వహించారు. జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో కూచిపూడి నాట్యం కార్యక్రమాలు ఆసక్తికరంగా జరిగాయి. యాంకర్ శాంతి తన ప్రసంగాలతో యువతలో సంతోషం పరిచారు. పలు సంప్రదాయ నృత్యంతో ఆకట్టుకున్నారు. ప్రముఖ మిమిక్రీ ఆర్టిస్టు శంకర్ ప్రదర్శనలు శ్రోతలను ఆకట్టుకు న్నాయి. శంకర్‌ను అతిథులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సరికొండ రమాదేవి కవితా సమ్మేళనం కార్యక్రమం పెద్దలను ఆకట్టుకున్నాయి. ప్రజలను సంతోష పరిచే విధంగా ఇండియన్ లెజెండరీ సింగర్ మాల్గాడి శుభ పాడిన పాటలు అందరిలో ఉత్సాహం నింపాయి. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శివశంకర్ కుటుంబసభ్యులు, శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిలను మేళ తాళాలతో ఊరేగింపుతో కలసి హాజరయ్యారు. ప్రజలు సుఖ సంతోషాలతో పండుగను జరుపుకోవాలని వారు పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో భాగంగా క్లాసికల్ నృత్య ప్రదర్శనలతో చిన్నారులు ఆకట్టుకున్నారు. ఇండియన్ లెజెండరీ సింగర్ మాల్గాడి శుభ సంగీత విభావరి ఆకట్టుకుంది. ఒడిశా బృందం పైకా యాక్ట్–ఈజిప్ట తులురా యాక్ట్, సోలో కార్యక్రమాలు సంక్రంతీ సంబరాల్లో సందడి చేశాయి. కార్యక్రమాలను జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, జిల్లా డీ ఆర్. డి. ఏ పీడీ బాలూనాయక్, శ్రీకళావేదిక వ్యవస్థాపక అధ్యక్షులు పొన్నపాటి శ్రీశ్వర రెడ్డి పర్యవేక్షణలో జరిగాయి.

వేల్పూరులో ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు...

శావల్యాపురం: మండలంలో అన్నీ గ్రామాల్లో సంక్రాంతి, కనుమ పండుగ వేడుకలు ప్రజలు ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి పండుగ వేడుకలు సంబరాలు అంబరాన్ని అంటాయి. రైతుల ఇళ్లలో ధాన్యపు రాసులు, ఇళ్ళ ముందు రంగుల ముగ్గులు, గొబ్బిములు, సంస్కృతులు, సంప్రదాయాలు నడుము వేడుకలు ప్రజలు వైభవంగా నిర్వహించారు. యువతీ, యువకులు సంప్రదాయ దుస్తులు ధరించి తమ ఆనందాన్ని అందరితో పంచుకున్నారు. పిండివంటలు, నేతి అరిసెల రుచులు, చిన్నారుల కేరింతలు మధ్య కుటుంబ సభ్యులందరూ ఉల్లాసంగా ఉత్సాహంగా పర్వదిన వేడుకలు జరుపుకున్నారు. ఆదివారం సంక్రాంతి పర్వదినం సందర్భంగా మండలంలోని వేల్పూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీభూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సతీమణి ఆదిలక్ష్మి దంపతులు, కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు అనంతరం ఉత్సవ విగ్రహాలు ఉరేగింపు కార్యక్రమం ప్రారంభించారు.

బంధుమిత్రులతో పల్లెలు కళకళ

యడ్లపాడు: సంక్రాంతి, కనుమ పండుగలను మండల ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. పట్టణాల్లో ఉన్న బంధుమిత్రులు, కొత్తఅల్లుళ్ల ఒక్కసారిగా పల్లెలకు తరలిరావడంతో ఊళ్లన్నీ కళకళలాడాయి. ప్రతిఇంటా పసుపు, కుంకుమ్మ, రంగవల్లుల అలంకరణతో సంక్రాంతి శోభ తొణికిసలాడింది. కుటుంబ సభ్యులు రంగవల్లులు ముచ్చటగా అలంకరించి పండుగకు స్వాగతం పలికారు. సంక్రాంతి, కనుమ వేడుకల్లో పాల్గొని సంబరాలు చేసుకున్నారు.

పరవశంగా పశువుల పండుగ

మండలంలో పశువుల పండగను ఆదివారం నిర్వహించారు. అన్నదాతలు ఆరుగాలం కష్టానికి తగిన ప్రతిఫలం సంక్రాంతికి ఇంటికి చేరింది. రెక్కల కష్టంలో చేదోడుగా నిలిచి శ్రమకోర్చిన పశువులకు అన్నదాతలు సమున్నత గౌరవమిచ్చారు. కనుమ పండగ రోజున పశువులను శుభ్రంగా కడిగి, కొమ్ములకు రంగులు పూశారు. పశుసంపద మరింత అభివృద్ధి చెందాలని పాడి రైతులు వేడుకున్నారు.

రొంపిచర్లలో...

రొంపిచర్ల: మండలంలో మండల ప్రజలు సంక్రాంతి పండుగను మూడురోజుల పాటు ఘనంగా నిర్వహించుకున్నారు. గ్రామాల్లోని గృహాలన్నీ కొత్త అల్లుళ్లతోబంధువులతో కళకళలాడాయి. ఇతర ప్రాంతాల్లో, ఇతర రాష్ట్రాల్లో, మహానగరాల్లో ఉద్యోగాలు, వ్యాపారాలు నిర్వహించుకునేవారు సహితం స్వగ్రామాలకు రావడంతో మరింత సందడి నెలకొంది. మకరసంక్రాంతి రోజున దేవాలయాల్లోని ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవాలు నిర్వహించారు.

రూరల్ పరిధిలో...

నరసరావుపేట రూరల్: సంక్రాంతి సంబరాలను మండలంలో ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో యువతీ, యవకులు, మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. దొండపాడు, పాలపాడు, రెడ్డినగర్, పెదరెడ్డిపాలెం, జొన్నలగడ్డ తదితర గ్రామాల్లో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. దొండపాడులో మహిళలకు ముగ్గులపోటీ, చిన్నారులకు లెమెన్ స్పూన్, డాన్స్‌బేబీ డాన్స్, యువకులకు వాలీబాల్, కబడ్డీ, క్రికెట్ పోటీలు నిర్వహించారు.

ముగిసిన సంక్రాంతి సంబరాలు

నాదెండ్ల: తెలుగు లోగిళ్లలో అతి పెద్ద పండుగైన సంక్రాంతిని పురస్కరించుకుని గ్రామగ్రామాన సంబరాలు మిన్నంటాయి. దేశవిదేశాల్లో స్థిరపడిన ప్రజలు సొంతూళ్లకు చేరుకోవటంతో గ్రామాలు కళకళలాడాయి. మండలంలోని సాతులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హైకోర్టు న్యాయవాది నర్రా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రెండు రోజుల పాటూ సంక్రాంతి పోటీలు జరిగాయి. విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం ఆయన్ను గ్రామ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు పూల మాలలతో సత్కరించారు. చిరుమామిళ్ల సర్పంచ్ సింగారెడ్డి లక్ష్మి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఎండుగుంపాలెం గ్రామంలో మాజీ సర్పంచ్ ఎస్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మహిళలు, యువతకు వేర్వేరుగా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు.

రంగవల్లులు సంప్రదాయ హరివిల్లులు

చిలకలూరిపేట: రంగవల్లులు సంప్రదాయ హరివిల్లులని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. వాసవీ క్లబ్, యంగ్‌స్టార్స్, ప్లాటిన, గోల్డెన్, వనితా డైమండ్స్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని వెంకటేశ్వరస్వామి ఆర్యవైశ్య కల్యాణ మండప ప్రాంగణంలో ఆదివారం సంక్రాంతి మహారాణుల ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ తెలుగు వారి సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే పెద్ద పండుగ సంక్రాంతి అని పేర్కొన్నారు. సంక్రాంతి ముగ్గులకు ప్రత్యేకత ఉందని చెప్పారు. సంక్రాంతి పండుగకు రంగుల వైభవాన్ని ముగ్గులు తీసుకు వస్తాయన్నారు. మహిళలు ఇంత పెద్ద సంఖ్యలో పాల్గొని సంక్రాంతి వైభవాన్ని తెలిపేలా గంగిరెద్దులు, గొబ్బెమ్మలు, హరిదాసులను తమ ముగ్గులలో ప్రస్ఫుటింపజేయటం వారి నైపుణ్యానికి నిదర్శనమని కొనియాడారు. సీనియర్స్ విభాగంలో ఎస్.శ్రీలక్ష్మి, మణిమంజరి, మాధవి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు.

ఆకట్టుకున్న నాటక ప్రదర్శనలు

వినుకొండ(నూజెండ్ల): రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ వినుకొండ, పెదకంచర్ల గ్రామీణ కళాపరిషత్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను మండలంలోని పెదకంచర్ల గ్రామంలో రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాటకాల ప్రదర్శన నటరాజ పూజ, జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర రచయిత్రిల సంఘం గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణకు ఎన్టీఆర్ రంగస్థల సేవా పురస్కారాన్ని నిర్వాహకులు అందజేశారు. పెట్రోమాక్స్ పంచాయితీ, పక్కింటి మొగుడు, యాది, మృత్యుపత్రం, దేవనర్తకి, సత్య హరిశ్చంద్ర నాటక ప్రదర్శనలు చూపరులను అలరించాయి. ప్రతిభ కనపరిచిన కళాకారులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

ముత్యాల ముగ్గులతో ...

బొల్లాపల్లి: మండల ప్రజలు సంక్రాంతి పండుగ సంప్రదాయపరంగా.. వేడుకగా జరుపుకున్నారు. లోగిళ్లలో ధాన్యపురాశులు ముత్యాలముగ్గులతో కళకళలాడాయి. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో గండిగనుమల గ్రామంలో కబడ్డీ పోటీలు నిర్వహించి, గెలుపొందిన విజేత టీంలకు ఎంపీపీ బత్తి గురవయ్య, పార్టీ యువ నాయకులు బొల్లా గిరిబాబు, చేతుల మీదుగ ప్రథమ, ద్వితీయ, తృతీయ రూ. 8, 5, 3 వేల బహుమతులను అందజేశారు. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో గెలుపొందిన మహిళలకు రూ.5,3,2 వేల రుపాయల నగదు బహుమతి, చీరలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రులకు అత్యంత సంప్రదాయపరమైన పండుగ సంక్రాంతి అని చెప్పారు. దేశంలో వివిధ ప్రదేశాల్లో నివశించే వారు ఆయా గ్రామాలకు చెరుకోని పండుగ జరుపుకోవడం అనవాయితీ అన్నారు.

అలాగే మండలంలోని గండిగనుమల గ్రామంలో సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు బత్తి గురవయ్య ఆధ్వర్యంలో 23 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాలకోటా నాయక్, భాస్కర్ నాయక్, ఏడుకొండలు నాయక్, బాలు నాయక్ బాలాజీ నాయక్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయాల్లో విశేష పూజలు



తిరువాభరణముల అలంకరణలో శ్రీఅయ్యప్పస్వామి

నరసరావుపేట ఈస్ట్: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరుక్మాబాయి సమేత పాండురంగస్వామి ఆలయంలో ధర్మకర్త తాటికొండ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో మూలవరులకు విశేష అభిషేకాలు, అలంకరణలు నిర్వహించారు. అలాగే సత్తెనపల్లిరోడ్డులోని శ్రీఅయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్పస్వామి, శ్రీపంచముఖ ఆంజనేయ స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి వెండి ఆభరణములతో అలంకరించారు. బరంపేటలోని శ్రీరాధాగోవింద చంద్రమందిరం ఇస్కాన్ ఆలయంలో మూలమూర్తులకు విశేష అలంకరణలు జరిపారు.

శావల్యాపురంలో నాలుగు తరాల కలయిక



గడుపూడి నరసయ్య–పాపమ్మ కుటుంబ సభ్యులు

శావల్యాపురం: సంక్రాంతి పర్వదినం సందర్భంగా మండల కేంద్రం శావల్యాపురంలో గడుపూడి నరసయ్య–పాపమ్మ కుటుంబ సభ్యులు పండుగ వేడుకలు ఉమ్మడిగా చేసుకున్నారు. ఈసందర్భంగా గడుపూడి వెంకట్రాయుడు, బిక్షావతి దంపతులు మాట్లాడుతూ నాలుగు తరాలకు చెందిన 18 కుటుంబాల వారందరూ 60 మంది కలిసి ఉమ్మడిగా పండుగ వేడుకలు జరుపుకోవటం సంస్కృతి సంప్రదాయాలకు నిలయంగా ఉండటం ఆనందంగా ఉందన్నారు. అనంతరం కుటుంబ సభ్యులతో యోగక్షేమాలు తెలుసుకోవటంతో పాటు ఆనందంగా ఉత్సాహంగా వేడుకలు నిర్వహించారు. వచ్చే నెలలో ఉచితంగా శంకర్ కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు ట్రస్టు అధ్యక్షులు గడుపూడి వెంకట్రాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో చెరుకూరి కోటినారాయణ, గడుపూడి విశ్వనాథం, జాలాది నాగప్రసాదు, గోరంట్ల సత్యనారాయణ పాల్గొన్నారు.



వేల్పూరులో ఉత్సవ విగ్రహాల ఊరేగింపు పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



గండిగనుమలలో బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ, యువ నాయకులు



ఎండుగుంపాలెం గ్రామంలో కబడ్డీ పోటీల్లో యువత



చిరుమామిళ్లలో రంగవల్లుల పోటీల్లో మహిళలు

ముగిసిన డీవైఎఫ్ఐ సంబరాలు

- నాలుగు రోజులుగా సాంస్కృతిక క్రీడా పోటీల నిర్వహణ
- ఉత్సాహంగా పాల్గొన్న గ్రామస్తులు

యడ్లపాడు: ఖలిస్తాన్ ఉద్యమం సమయంలో 1980లో ఆవిర్భవించిన డీవైఎఫ్ఐ (భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య) నాడు దేశం విచ్ఛన్నం కాకుండా ఎన్నో త్యాగాలను చేసి యువత నేటికీ దేశసమగ్రత, సౌభాగ్యం కోసం పోరాడుతూనే ఉందని డీవైఎఫ్ఐ పల్నాడు జిల్లా కార్యదర్శి ఆంజనేయరాజు చెప్పారు. మండలంలోని లింగారావుపాలెంలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో 43వ సంబరాల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ నెల 12 నుంచి 15వ తేదీ వరకు అన్ని వర్గాల వారికీ క్రీడా, సాంస్కృతిక పోటీలను ఘనంగా నిర్వహించారు. క్రికెట్ వాలీబాల్, చెస్, క్యారెమ్స్, క్విజ్, వ్యాసరచన, సైకిల్ స్లో, రన్నింగ్ రేస్, 4 కె మారథన్, మహిళలకు ముగ్గులపోటీ, కుండకొట్టుట, మ్యూజికల్ చైర్స్, ఫన్నీగేమ్స్ నిరంతరాయంగా కొనసాగాయి. ఆయా పోటీల్లో సబ్‌జూనియర్, జూనియర్స్, సీనియర్స్ విభాగాలలో ప్రథమ, ద్వితీయ స్థానాలో విజేతలైన వారికి బహుమతులు అందజేశారు. శని, ఆదివారాలు రెండు రోజులు సాంస్కృతిక ప్రదర్శనలు, బహుమతుల పంపిణీ కార్యక్రమాల్ని నిర్వహించడం విశేషం. సాంస్కృతిక ప్రదర్శనల్లో జెడ్పీహైస్కూల్ విద్యార్థులు చేసిన శాస్త్రీయ, జానపద నృత్యాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఆయా కార్యక్రమాలను డీవైఎఫ్ఐ ప్రతినిధులు సామినేని శ్రీనివాసరావు, రావూరి సుమన్, కె.గోపీ, రామోజీ, జి.లెనిన్ పర్యవేక్షించారు. పార్టీలకతీతంగా జరిగిన ఈ కార్యక్రమాల నిర్వహణకు ఎన్నారైలు, విజన్ ఫౌండేషన్, లింగారావుపాలెం అభివృద్ధి కమిటీ, పూర్వవిద్యార్థుల సంఘం, స్థానిక వ్యక్తులు సంక్రాంతి వేడుకలు ఇదే విధంగా ప్రతిఏటా నిర్వహించుకునేలా రూ.5 లక్షల మూలనిధిని అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. నాలుగు రోజుల పాటు జరిగిన ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్ షేక్ కరీమున్నిసా, ఎంపీటీసీ సభ్యుడు తోకల వీరరాఘవయ్య, గ్రామపెద్దలు ఆలోకం వెంకట లక్ష్మీనారాయణ, కట్టా శ్రీహరిరావు, నంబూరి కృష్ణారావు, శివరామకృష్ణయ్య, గోగడ హరిబాబు, నంబూరి వీరాంజనేయులు, నల్లపనేని భావనారాయణ, పూర్వ విద్యార్థుల సంఘం నుంచి నంబూరి నరసింహారావు, శొంఠినేని వెంకటనారాయణ, నెల్లూరి వంశీ పాల్గొని విజేతలను అభినందించారు.

కొండ్రముట్లలో దారిదోపిడీ

ఈపూరు: బహిర్భూమికి వెళ్లేందుకు ద్విచక్రవాహనాన్ని ఆపడంతో వారి వద్ద నుంచి గుర్తుతెలియని అగంతకులు నగదు దోచుకెళ్లిన సంఘటన మండల పరిధిలోని కొండ్రముట్ల సమీపంలోని సత్యనారాయణపురం వద్ద ఆదివారం రాత్రి జరిగింది. ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం రమణారెడ్డివారిపాలెం గ్రామానికి చెందిన దార్ల రాముడు, రమణమ్మ దంపతులు హైదరాబాద్‌లో బేల్దారు పనుల నిమిత్తం ఉంటూ పనిచేసుకుంటున్నారు. ఈ క్రమంలో పండుగ అని ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి బయలుదేరారు. మండల పరిధిలోని సత్యనారాయపురం సమీపంలో ద్విచక్రవాహనాన్ని ఆపి భార్య రమణమ్మను బండి వద్ద ఉంచి భర్త రాముడు బహిర్భూమికి వెళా డు. ఈ క్రమంలో అటునుంచి ద్విచక్ర వాహ నంపై ముగ్గురు యువకులు ఆమె దగ్గర బండి ఆపి ఆమె చేతిలో ఉన్న బ్యాగ్‌ను బలవంతంగా లాక్కొని పారిపోయారు. ఆమె కేకలు వేయడంతో భర్త పరుగున వచ్చి వారి కోసం కొంతదూరం వెతికినా లాభం లేకపోవడంతో వారి బంధువులకు సమాచారం ఇచ్చి స్వగ్రామానికి బయలుదేరారు. బ్యాగ్‌లో రూ.1.65 లక్షలు నగదు, రెండు చెవి కమ్మలు ఉన్నాయని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కనుల పండువగా తెప్పోత్సవం

–సంక్రాంతి సందర్భంగా లింగారావుపాలెం, జాలాది గ్రామాల్లో నిర్వహణ



లింగారావుపాలెం పుష్కరిణిలో దేవతామూర్తుల తెప్పోత్సవం దృశ్యం

యడ్లపాడు: మకర సంక్రాంతి పర్వదినాన జరిగే గోదా కళ్యాణం అనంతరం నిర్వహించే తెప్పోత్సవ సంబరాలు అంబరాన్ని అంటాయి. దశాబ్దాల కాలంగా మండలంలోని లింగారావుపాలెం, జాలాది గ్రామాల్లో ఈ వేడుకలను గ్రామ పెద్దలు ఎంతో వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. ఈ వేడుకలకు ఉత్సవ మూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించారు. శివ, వైష్ణవ మతాలకు చెందిన దేవతా మూర్తులు జల విహార వైభవ ఘట్టం భారతీయ సంప్రదాయలకు అద్దం పట్టింది. యడ్లపాడు మండలంలోని లింగారావుపాలెంలోని గ్రామస్తులందరి ఆధ్వర్యంలో శ్రీగంగాపార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి, సీతారామ దేవస్థానాలు ఆదివారం సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. అర్చకులు పుణ్యాహవచనం, సంప్రొక్షణ, గోపూజ నిర్వహించి భాజాభజంత్రీలతో.. మేళతాళాలతో గ్రామోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను గ్రామ నడిబొడ్డున్న ఉన్న చెరువు వద్దకు ఊరేగింపుగా తీసుకురాగా, యువకులు, పెద్దలు రెండు బల్లకట్టు పడవలను తయారు చేసి విశేషంగా అలంకరించారు. దేవతామూర్తులను వాటిపై నిలిపి చెరువు నందు జలవిహారం చేయించారు. వేడుకలను తిలకించేందుకు ఊరు ఊరంతా తరలి చెరువు వద్దకు చేరుకున్నారు.

జాలాది గ్రామంలో...జల విహారం

జాలాది గ్రామం హరహతదత్త క్షేత్రంలోని రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణు గోపాలస్వామి, గంగపార్వతీ సమేత శ్రీచెన్నమల్లేశ్వరస్వామి ఆలయాల్లో మకర సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రంలోని అన్ని ఆలయాలకు భారీ విద్యుత్ దీపాలను అలంకరించారు. ఆలయ అర్చకులు పుసులూరి పెద్ద అప్పలాచార్యులు, కారంచేటి ప్రఫుల్లాకుమార్, మల్లికార్జున సుబ్బశాస్త్రి పండగ పూజల్ని నిర్వహించి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఆలయం పక్కనే ఉన్న చెరువు వద్దకు స్వామివార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో తీసుకువెళ్లి వివిధ పుష్పాలతో శోభాయమానంగా తీర్చిదిద్దిన బల్లకట్టుపై తెప్పోత్సవం నిర్వహించారు.